కర్షకా.. దిగులు లేదిక..

- ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు
- బీమా ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం
- గ్రామాల్లో జోరుగా ఈ-పంట నమోదు

నియోజకవర్గంలో రైతుల వివరాలు

మండలం	రైతులు
గొల్లప్రోలు	10441
కొత్తపల్లి	8166
పిఠాపురం పట్టణం, మండలం	17311
మొత్తం	35918



గొల్లప్రోలులో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పిఠాపురం: దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఆసరా కల్పించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోంది. రైతుల పరిభాషలో చెప్పాలంటే ×పొయ్యి వద్ద ఆకుమడిలా× అన్ని వసుతులను వారి కాళ్ల దగ్గరకే తెచ్చి పెడుతోంది. ఈ ఏడాది ఈ-క్రాఫ్ నమోదు ప్రారంభమవ్వడంతో రైతులను సమాయత్తం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించి అన్నదాతలకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆర్‌బీకేల ద్వారా మెరుగైన సేవలు

రైతు సంక్షేమమే ధ్యేయమంటూ ప్రసంగాలు గుప్పించి చేతులు దులుపుకునే గత పాలకులకు భిన్నంగా ప్రతి రైతుకూ మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. విత్తు నుంచి పంట కొనుగోలు వరకూ రైతుకు అవసరమైన అన్ని సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తోంది. ఆర్‌బీకేల్లో మెరుగైన సేవలు అందడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విస్తృతంగా ప్రచారం

రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల పంటలకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం కలిగితే ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండానే రైతుకు నష్టపరిహారం అందేలా ఆయా రైతుల పేరున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించనుంది. రైతులకు సూచనలు, సలహాలు అందించడానికి నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలోనూ ఈ-క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు వ్యవసాయ శాఖాధికారులు. నియోజకవర్గంలో ఏ రైతు ఇతర గ్రామాలకు వెళ్లనవసరం లేకుండా ఉన్న ఊరులోనే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ వేయించుకుంటే సరిపోతుంది. పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదు ప్రారంభించాం

అన్ని మండలాల్లోనూ ఈ-క్రాప్ నమోదు ప్రారంభించాం. వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నందున రైతులు తమ రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, సీసీఆర్ కార్డు తీసుకుని వెళ్లి రైతు భరోసా కేంద్రాలకు వెళితే అక్కడ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేస్తారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతులకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన సదస్సులు నిర్వహించాం. రైతులు ఏ విధమైన ప్రభుత్వ లబ్ధి పొందాలన్నా ఈ-క్రాప్ తప్పనిసరి. వరితో పాటు మొక్కజొన్న, పత్తి, అపరాలు, మామిడి, జీడిమామిడి ఇలా ఏపంటలైనా సరే ఈ-క్రాప్ చేయించుకోవాల్సిందే.

– సత్యనారాయణ,
మండల వ్యవసాయశాఖాధికారి, గొల్లప్రోలు

తాగునీరు కలుషితం



రవీంద్రపురంలో కుళాయిల నుంచి వచ్చిన తాగునీరు

కొత్తపల్లి: గ్రామ శివారు రవీంద్రపురంలో తాగునీరు కలుషితమవుతోంది. పైపు లైన్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధాన పైపు లైన్ డ్రైనేజీల కింద ఉండడం, పలుచోట్ల మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కుళాయిల నుంచి జలగలు, క్రిమి కీటకాలు, నాచు వస్తున్నాయని, ఆ నీరు కనీసం వాడుకోవడానికి కూడా ఉపయోగపడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

18న మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ కారే సుధ ఆధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల విశిష్టతను వివరిస్తున్న పాస్టర్ శామ్యూల్

పెద్దాపురం: మండలంలోని చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన విశాఖకు చెందిన దైవజనులు సీయోను శామ్యూల్ దైవ ప్రసంగాన్ని అందించారు. పాస్టర్ ఆనందకుమార్ ఆలపించిన క్రైస్తవ గీతాలు ఆకట్టుకున్నాయి. వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, దైవజనులు వంకా జాన్, కె.అభిషేక్, దైవ సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అధికారులకు రైతుల సత్కారం



ఎంపీడీఓ శ్రీలలితను సత్కరించిన రైతులు

సామర్లకోట: మండల పరిధి అధికారులను వీకే రాయపురం రైతులు శుక్రవారం సత్కరించారు. గ్రామంలోని తూటీరు డ్రైనులో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపునకు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీడీఓ డి.శ్రీలలిత, మండల వ్యవయాసాధికారి ఐ. సత్యలను సత్కరించారు. వాస్తవ పరిస్థితిని కలెక్టరుకు వివరించి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చేశారని వారిని సత్కరించారు. రైతులు తలారి దొరబాబు, ఇంటి రమేష్, పెదిరెడ్ల కొండల రావు, వెలమర్తి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భాగవత సప్తాహం



భాగవత ప్రవచనాలు చేస్తున్న మల్లికార్జున స్వామి

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో భాగవత సప్తాహం నిర్వహించారు. పెద్దాపురం ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రవచనాలు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ చోడిశెట్టి చిన్న జోగారావు, కోలా వీరరాఘవ, ఆలయ ప్రధానార్చకులు శ్రీమన్నారాయణ, హిందూ ధర్మ ఐక్య వేదిక సభ్యులు జీవీకే మోహనరావు, కూనంశెట్టి అర్జునరావు, భగవద్గీత ప్రచార సేవా సమితి ఉపాధ్యక్షుడు నేతి వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి సత్యకుమార్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



కొత్తపల్లిలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ సుష్మ

కొత్తపల్లి: నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాల మృతవీరుల సంస్మరణ సభ



మాల మృత వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శుక్రవారం ఏపీ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు అధ్యక్షతన మాల మృత వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. మాల మృత వీరులు పీవీ రావు, పానంగి శేషయ్య, ఓపతోట నారాయణ, తాడి అచ్చారావు, బేతాళ పుష్కలరాజు చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గద్దర్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కృపానందం, బందిలి సూరిబాబు, బర్రే రాజు, దడాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సత్య

సామర్లకోట: మండల పరిధిలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభమైందని, రైతులు తమ పంటలను నమోదు చేయించుకొవాలని ఎంఏఓ ఐ.సత్య పిలుపునిచ్చారు. మండల వ్యవసాయ సలహ మండలి సమావేశం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి ఈ-క్రాప్ నమోదు ఆధారంగానే ధాన్యం కొనుగోలు ఉంటుందని చెప్పారు. లిక్విడ్ యూరియాపై రైతుల్లో అవగాహన పెంచడానికి ఆర్బీకేలో ఏర్పాటు చేయడం జరిగిందని ఉత్సాహం కలిగిన రైతులు ప్రయోగం చేయాలని సూచించారు. మండల పరిధిలో వీకే రాయపురం, హుస్సేన్‌పురం గ్రామాల్లోని పంట పొలాలకు సాగు నీరు సక్రమంగా అందక పొలాలు బీటలు వేసినట్లు గమనించామని, ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పశువుల వ్యాధుల నివారణకు వ్యాకిన్ వేయించుకోవాలని సూచించారు. విస్తరణాధికారి ఎంవీ సతీష్, సలహా మండలి సభ్యులు రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



వార్డు సభ్యుడు రాజబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన పంచాయతీ వార్డు సభ్యుడికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ 5వ వార్డు మెంబరు రాజాల రాజబాబు శుక్రవారం పిఠాపురంలో ఎమ్మెల్యే దొరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజబాబును అభినందించి శాలువాతో సత్కరించారు. సమన్వయంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్ సీపీ నేతలు బండి దావీదు, ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

రంగా వర్సిటీ బోర్డు సభ్యుడిగా చింతా

కరప: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యుడిగా కరప మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పెద కొత్తూరు గ్రామానికి చెందిన చింతా ఈశ్వరరావు నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వర్సిటీ బోర్డుకు 15 మందిని సభ్యులను నియమిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీచేశారని, సీఎస్ పీఏ శుక్రవారం తనకు ఫోన్ చేసి బోర్డు సభ్యునిగా నియమించినట్టు ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు.

బ్యాలట్ బాక్సుల పరిశీలన

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరచిన బ్యాలట్ బ్యాక్సులను శుక్రవారం జిల్లా పరిషత్, మండల అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ ఎ.అప్పారావు, జెడ్పీ ఉద్యోగులు మహ్మద్ తాఖీ, యుఎస్ రవికిరణ్, ఉపాధిపథకం ఏపీఓ ఈ.వెంకటరమణ వీటిని పరిశీలించారు. ఈనెల 19న గ్రామ పంచాయతీలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నందున అవసరమైన గ్రామాలకు బ్యాక్సులు పంపనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. మండల పరిధిలో నడకుదురు, గొడ్డటిపాలెం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున వార్డు సభ్యులకు ఉప ఎన్నిక జరగనుందన్నారు.





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

అపూర్వ స్వాగతం

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురం వచ్చారు. అక్కడ ముఖ్యమంత్రిని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కలిసి అపూర్వ స్వాగతం పలికారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

- లబ్ధిదారులతో జేసీ ఇలక్కియ



సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో లబ్ధిదారులతో సమీక్షిస్తున్న జేసీ ఇలక్కియ

సామర్లకోట: స్థానిక ఈటీసీ జగనన్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని జేసీ ఎస్.ఇలక్కియ అన్నారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మాణాలు పూర్తయిన వారు రంగులు వేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని వారు థర్డ్ ఆప్షన్‌లో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావాలన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు రూ.35 వేలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే సమయానికి వంద శాతం ఇళ్ల నిర్మాణాలు జరగాలన్నారు. ఇంటి నిర్మాణానికి కావలసిన రుణం, ఇసుక, ఐరన్, సిమెంట్‌ను ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేస్తుందన్నారు. డీఎల్‌డీఓలు కేవీఎస్ఆర్ ప్రసాద్, పి.నారాయణమూర్తి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, హౌసింగ్ ఏఈలు ఎం.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత, ఆర్పీలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మలుపు... ప్రమాదాలకు పిలుపు



కొమరగిరి- ఆనందనగర్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి-ఆనందనగర్ రోడ్డులో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డులో ఎస్, ఎల్, యూ ఆకారంలో మలుపులు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. తరచూ ప్రమాదాలు సంభవించి ఎంతో మంది వాహనచోదకులు క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు ప్రమాదాల నియంత్రణ కోసం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. కొమరగిరి శివారులోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద మలుపులో కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడులు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురై కాలవలో పడి క్షతగాత్రులువుతున్నారు. ఇక్కడ ఇటీవల జరిగిన ప్రమాదంలో వ్యక్తి మతి చెందాడు. గోర్స భద్రుని చెరువు వద్ద ఉన్న మలుపులో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ మలుపులో ఎటువంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగ నరసింహారావు

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా సీహెచ్ నాగనరసింహారావు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల బదిలీ కావడంతో నాగ నరసింహారావుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. పుర పరిపాలన శాఖ ఆదేశాల నేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌ను వివిధ విభాగాధిపతులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.

రీ సర్వే సకాలంలో పూర్తి చేయాలి

కరప: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సమగ్ర రీసర్వేను సకాలంలో పూర్తిచేయాలని ఆర్డీఓ ఎన్‌వీ సత్యనారాయణ అన్నారు. మండల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కరపలో జరుగుతున్న మక్కురాళ్ల పాతిపెడుతున్న పనులను పరిశీలించి, సర్వేయర్లకు పలుసూచనలు చేశారు. సర్వేలో విస్తీర్ణంలో వ్యత్యాసాలుంటే రైతుల రికార్డులు కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. వివాదాలకు తావివ్వకుండా రైతుల సమక్షంలో మక్కురాళ్లు పాతాలన్నారు. కాకినాడ డివిజన్ పరిధిలో 121 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, ఆయా గ్రామాల్లో మక్కురాళ్లు పాతుతున్నట్టు తెలిపారు. కరప మండలంలో 19 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని ఆయన తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో విక్రయానికి జాతీయ పతాకాలు

సామర్లకోట: స్థానిక హెడ్ పోస్టాఫీసులో జాతీయ పతాకాలను విక్రయిస్తున్నట్లు హెడ్ పోస్టు మాస్టర్ పీవీఆర్ రావు తెలిపారు. దేశ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ ఇళ్లపై జాతీయ పతకాలు ఉండేలా చూడాలనే సూచన మేరకు ప్రజలకు అందుబాటులో జాతీయ పతాకాలు సిద్ధం చేసిన్నట్లు చెప్పారు. రూ.25కే జాతీయ జెండాలను విక్రయిస్తున్నామన్నారు.

సామర్లకోట హెడ్ పోస్టాఫీసులో విక్రయానికి సిద్ధంగా ఉన్న జాతీయ జెండాలు



పారిశుధ్యంపై అలసత్వం వద్దు

- సిబ్బందిపై కమిషనర్ మండిపాటు
- ఇద్దరిపై సస్పెన్షన్ వేటు



పారిశుధ్య పనులపై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వంపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. శుక్రవారం కాకినాడ 12వ సర్కిల్ పరిధిలోని 38వ డివిజన్ నాగేశ్వరరావు వీధి, పామువారి వీధి ప్రాంతాల్లో పనులను ఆయన తనిఖీ చేశారు. కొన్నిచోట్ల చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించి సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడపగడపకు ప్రభుత్వంలో పారిశుధ్యంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో సచివాలయ కార్యదర్శి కిషోర్, శానిటరీ మేస్త్రి శ్రీనివాస్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతెప్ప నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

ఓటర్ల సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని కమిషనర్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీఎల్‌ఓలతో ఓటర్ల సర్వేపై సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 20వ తేదీ లోపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బీఎల్‌ఓ సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ సీతాపతిరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంచుకోవాలి



పెద్దాపురంలో జాతీయ నాయకులకు నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్



గొల్లప్రోలులో ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పనసపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ తదితరులు

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించు కోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. నా భూమి నాదేశంలో భాగంగా శుక్రవారం పాత పెద్దాపురం బొమ్మలగుడి వద్ద జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కృష్ణబాపూజీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీబీ దేవంలో..

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి గౌరవార్థం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని చినబ్రహ్మదేవం గ్రామ పంచాయతీలో శుక్రవారం నా భూమి-నా దేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి త్సలికి దొరబాబు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించి ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, రాంపండు, శ్రీనివాస్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతిజ్ఞ చేశారు.

గొల్లప్రోలులో నా భూమి-నా దేశం

పిఠాపురం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గొల్లప్రోలు నగర పంచాయతీలో శుక్రవారం నా భూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు జెండా ఊపి వేడుకలను ప్రారంభించారు. కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నగర పంచాయతీ సిబ్బంది సచివాలయ, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు, వలంటీర్లు జెండాలతో స్వాతంత్ర్య వీరులను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. వీరులకు వందనం శిలాఫకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, పర్ల రాజా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: నా భూమి- నాదేశంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలో నవర, పనసపాడు పంచాయతీల్లో స్వాతంత్ర యోధులు, రక్షణ దళ సభ్యులకు వందనం చెప్పుతూ శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్‌లు దమ్మాల లక్ష్మణ రావు, చీకట్ల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి, అమీనాబాద్ పంచాయతీల్లో శుక్రవారం ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి-నా దేశం కార్యక్రమాలు నిర్వహించారు. చెరువు గట్లపై ప్రత్యేక శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. కొమరగిరిలో సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని జాతికి అంకితం చేశారు. అమీనాబాద్‌లో గ్రామ సర్పంచ్ నక్క మణికంఠబాబు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ అబ్రహం లింకన్, పంచాయతీ కార్యదర్శులు వారిజ, రవికుమార్, ఏపీఓ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై ప్రచారం చేయాలి

కరప: అవయవ దానంపై విస్తృతంగా ప్రచారం చేయాలని కాకినాడ అవయవదాన సంస్థ అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఈనెల 13న జరిపే ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం జనరక్ష స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా మరణించిన తర్వాత అవయవాలను దానంచేసేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఈసందర్భంగా కాలేజీవిద్యార్థులు అవయవ దానం చేయడానికి ముందుకువచ్చి, అంగీకారపత్రాలు అందజేశారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ అప్పలరాజు, స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చెక్కా వినయ్‌కుమార్, ట్రస్ట్ ఆఫ్ బోండా అధ్యక్షుడు డాక్టర్ బొండా వెంకన్నారావు పాల్గొన్నారు.